సాక్షి నంద్యాల

సోమవారం । 28 । జూలై । 2025



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన దుర్గా నృత్య కళా నిలయం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



శ్రీశైలంలో తెలంగాణ హైకోర్టు జడ్జి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.



పెళ్లి చూపులకు రారండోయ్!

కైరుప్పల గ్రామంలో పిడకల సమరం అందరికీ తెలిసే ఉంటుంది. ప్రేమికులైన వీరభద్రస్వామి, కాళికాదేవి వివాహం తంతులో పెళ్లి చూపులు శ్రావణ మాసంలో నిర్వహించనున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

శ్రీగిరిలో భక్తుల సందడి



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం తోలి ఆదివారాన్ని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలి వచ్చారు. వేకువజాము నుంచి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్ని కిటకిటలాడాయి.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తులను ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov. in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

కుందూనది తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(న్యూటౌన్): కుందూనది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద చేరుతుండటంతో బానకచర్ల, వెలుగోడు, కేసీ కెనాల్, శ్రీశైలం బ్యాక్ వాటర్ విడుదలవుతుందన్నారు. పట్టణంలోని మద్దిలేరువాగు, హరిజనవాడ, బైటిపేట, తెలుగుపేట, ఊడుమాల్పురం వంటి కుందూ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల పట్ల వార్డు సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండి పరిరక్షించాలన్నారు. మరింత సమాచారం కోసం మున్సిపల్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూం నంబర్ 7702776048ను సంప్రదించాలన్నారు.

ఉప ప్రధానార్చకుడి ఆత్మహత్యపై విచారణ



విచారణ చేస్తున్న శ్రీశైలం ఈఓ శ్రీనివాసులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పూజన్నస్వామి ఆత్మహత్యపై ఆదివారం రాత్రి శ్రీశైలం ఈఓ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. ముందుగా ఆయన పూజన్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పూజన్న ఆత్మహత్యపై ఏమైనా అనుమానాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవాలయ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ విజయరాజును, ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామిని, ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామిలతో పాటు అర్చకులందరినీ పిలిచి విచారణ చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు బీపీ, షుగర్ ఉండడంతో సమాయానికి మందులు తీసుకోకపోవడంతో పూజన్నస్వామి మృతి చెందారన్నారు. దేవాలయంలో పని చేస్తున్న ప్రతి అధికారి ఇచ్చిన సమాచారాన్ని నివేదిక రూపంలో రాష్ట్ర కమిషనర్‌కు పంపిస్తామన్నారు. దేవాలయంలో అర్చకులు వర్గాలుగా విడిపోయారా, పూజల్లో ఏమైనా మార్పులు జరిగాయా, డిప్యూటీ కమిషనర్ ఏమైనా ఇబ్బందులకు గురి చేశాడా అన్న విషయాలపై కూడా విచారణ చేపట్టామన్నారు.

- యుక్త వయస్సులోనే గుండెపోట్లు
- ఆకస్మికంగా మృతి చెందుతున్న యువత
- 25 నుంచి 40 ఏళ్లలోపు వారిలో అధిక గుండె సమస్యలు
- జీవనశైలి మార్పులే కారణం



యువత.. హృదయ వేదన!

➤ కర్నూలు నగరంలోని ఆదిత్యనగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ అనే పాతికేళ్ల యువకునికి గత నెలలో గుండెపోటు వచ్చింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశాడు. చేతికి వచ్చిన కుమారుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబసభ్యుల ఆవేదన అంతా ఇంతా కాదు.

➤ కల్లూరుకు చెందిన శివకుమార్ అనే 30 ఏళ్ల యువకునికి ఏడాది క్రితమే వివాహమైంది. ఈ నెల మొదటి వారంలో అతనికి అకస్మాత్తుగా వచ్చిన గుండెపోటు ప్రాణం తీసింది. దీంతో ఆయన భార్యతో పాటు తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

➤ పత్తికొండ మండలం దూదెకొండ గ్రామంలో ఈ నెల 5న పీర్ల ఊరేగింపులో నాట్యం చేస్తుండగా గ్రామానికి చెందిన రామాంజనేయులు(42) గుండెపోటుకు గురయ్యాడు. ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో అతని కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటు అంటే ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారికి మాత్రమే వచ్చేది. కానీ ఇప్పుడు పాతికేళ్ల వయస్సు వారికీ వస్తోంది. ఇటీవల కాలంలో పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో యువత గుండెపోటుతో మృతి చెందుతున్నారు. జీవనశైలిలో మార్పులు, వ్యాయామం లేకపోవడం, మితిమీరిన ఆహారపు అలవాట్లు, దురవాట్లే ఈ పరిస్థితికి కారణమని వైద్యులు చెబుతున్నారు.

బాధితుల్లో 5 శాతం యువత

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీకి ఇటీవల గుండెపోటుతో చికిత్సకు వచ్చేవారి సంఖ్య ఎక్కువైంది. ఇందులో కొందరు ఆసుపత్రికి వచ్చేలోపు, మరికొందరు చికిత్స పొందుతూ మృతి చెందుతున్నారు. ఇంకొందరు కార్డియాలజీ విభాగానికి ఆపరేషన్‌కు వెళ్తున్నారు. ఇలా కార్డియాలజీ విభాగానికి గత సంవత్సరం రోజుల్లో ఓపీకి 22,325 మంది గుండెజబ్బులతో చికిత్సకు రాగా 4,281 మంది విభాగంలో చేరారు. వీరిలో 1,235 మందికి యాంజియోగ్రామ్, 433 మందికి యాంజియోప్లాస్టీ(స్టెంట్) వేశారు. ఇందులో 125 మంది 25 నుంచి 40 ఏళ్ల వయస్సు వారే ఉండటం గమనార్హం. ఇదే పరిస్థితి నగరంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో నెలకొంది. ఆయా ఆసుపత్రులకు ఒక్కో దానికి ప్రతిరోజూ రోజుకు సగటున 10 మంది గుండెజబ్బులతో చికిత్స పొందుతున్నారు. జిల్లాలో 10 శాతం మంది ప్రజలు గుండెజబ్బులతో బాధపడుతున్నట్లు గతంలో నిర్వహించిన ఓ సర్వేలో నిర్ధారణ అయ్యింది. ఆసుపత్రులకు చికిత్స కోసం వస్తున్న వారిలో 5 శాతం మంది యువతే ఉంటున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు వంశపారంపర్యం, జన్యులోపాలు, మేనరికపు వివాహం వంటి కారణాలతో పుట్టుకతోనే గుండెజబ్బులతో జన్మించే పిల్లలూ ఇటీవల అధికమయ్యారు.

మారిన ఆహారపు అలవాట్లు

ప్రతి ఒక్కరికీ పోషకాహారం తీసుకుని మరింత ఆరోగ్యంగా ఉండాలన్న ఉత్సుకత అధికమైంది. ఈ క్రమంలో తీసుకోవాల్సిన దానికన్నా అధికంగా ఆహారాన్ని తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఆహారంలో మాంసాహార సేవనం అధికమైంది. డ్రైఫ్రూట్స్ వాడకం పెంచేశారు. అందుకుతగ్గ వ్యాయామం చేయడం లేదు. దీంతో శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతోంది. రక్తనాళాల్లో ఎక్కడికక్కడ బ్లాక్‌లు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలోనే ఉన్న ఫలంగా గుండెపోటు, పక్షవాతం కేసులు అధికమవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు కార్పొరేట్ సంస్కృతితో ఇతర దేశాలు, రాష్ట్రాల్లో లభించే ఆహారాన్ని సైతం ఇక్కడి వారు ఎక్కువ తీసుకుంటున్నారు. సాధారణంగా ఏ ప్రాంతం వాతావరణానికి తగ్గట్లు అక్కడి ప్రజలు ఆహారం తీసుకుంటారు. ఉత్తరాదిలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.. అక్కడి వారు శరీరంలో ఉష్ణోగ్రతను పెంచే ఆహారాన్ని ఎక్కువ తీసుకుంటారు. దక్షిణాదిలో వాతావరణం వేడిగా ఉంటుంది పెద్దలు చెప్పిన ఆహార నియమాలను పాటించాలి. అయితే ప్రాంతీయ భేదం లేకుండా అన్ని ఆహార పదార్థాలను ప్రజలు రుచి చూస్తున్నారు. దీనివల్లే జీవన విధానంలో మార్పులు వచ్చి ఆరోగ్యం దెబ్బతింటోందని వైద్యులు చెబుతున్నారు. అలాగే పాటు ఒకేచోట ఎక్కువసేపు కూర్చుని పనిచేసే ఉద్యోగాలు కావడంతో అధికబరువున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ఈ కారణంగా శరీరంలో కొవ్వు శాతం పెరిగి అనేక అనారోగ్య సమస్యలు పలకరిస్తున్నాయి. అధిక చక్కెర, మాంసాహారం, వెన్న, నూనెలు వంటివి కొవ్వు పదార్థాలు గుండెజబ్బులు రావడానికి ముఖ్యపాత్ర వహిస్తున్నాయి.


నిద్రలేమి, మానసిక ఒత్తిడి కారణం



ఇటీవల కాలంలో చాలా మంది యువకుల్లోనూ గుండెపోటు వస్తోంది. ఆసుపత్రికి వచ్చే వారిలో 30 శాతానికి పైగా వీరుంటున్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం, మితిమీరిన మానసిక ఒత్తిడి, అనియత జీవనశైలి, నిద్రలేమి, పొగతాగడం, మద్యంసేవనం అలవాట్లు చిన్న వయస్సులో గుండెపోటు రావడానికి కారణం. కొందరు యువత శారీరక దారుఢ్యం కోసం అధికంగా వర్కవుట్స్ చేయడం కూడా గుండెపై ఒత్తిడి పెంచుతోంది.

– డాక్టర్ బి.కిరణ్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఒక క్రస్ట్ గేటు నుంచి నీటి విడుదల



ఒక గేటు ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం నీలంసంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్ట్‌లో తెరచి ఉంచిన రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లలో ఒక దానిని ఆదివారం మూసివేసి ఒక క్రస్ట్ గేటు ద్వారా 26,698 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి జలాశయంలో 198.8120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 882 అడుగులకు చేరుకుంది. శనివారం నుంచి ఆదివారం వరకు జూరాల, సుంకేసుల నుంచి 1,57,715 క్యూసెక్కుల వరదనీరు శ్రీశైలంకు వచ్చి చేరింది. జలాశయం నుండి దిగువ ప్రాజెక్ట్‌లకు 53,516 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.917 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.335 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 69,771 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 53,744 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 30,000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,401 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్‌గా ఇసాక్‌బాషా



నంద్యాల: ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాను నియమిస్తున్నట్లు ఏపీ శాసన వ్యవస్థ జనరల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ ఆదివారం ప్రకటించా రు. స్పీకర్, శాసన మండలి చైర్మన్లు 2025–26 సంవత్సరానికి శాసన సభ, శాసన మండలి సంయుక్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్‌గా ఇసాక్‌బాషాను నియమించారు.



ఉయ్యాలవాడ సమీపంలో పత్తి సాగు కోసం సాల్లు తోలుతున్న రైతు

అదును దాటుతోంది.. ఆందోళన మొలకెత్తుతోంది!

కమ్ముకుంటున్న మేఘాలు వర్షించడం లేదు. సాగుకు సిద్ధం చేసిన భూములు పదును క్కడం లేదు. రైతుల్లో ఆందోళన మొలకెత్తుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా వాన ల్లేక పోవడంతో వ్యవసాయం మందకొడిగా సాగుతోంది. ఇప్పటికే విత్తనం, నాట్లు పూర్తయి సేద్యం పనులు ఊపందుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు 30 శాతం కూడా సాగు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో పత్తి, మిరప, మొక్కజొన్న, వరి సాగు చేసిన రైతులు నాట్లు వేసి ఎదురు చూస్తున్నారు. కొందరు వరుణుడిపై భారం వేసి చిన్నపాటి వర్షాలకే నాట్లు వేస్తున్నారు. – ఉయ్యాలవాడ



రూపనగుడి గ్రామ సమీపంలో పత్తి నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

'అమ్యామ్యాల' అనుబంధం!

- బీఈడీ కళాశాలల అఫ్లియేషన్‌కు ఎన్‌సీటీఈ నిబంధనలు నిలిచేనా?
- కొన్ని బీఈడీ కళాశాలలకు పీఏఆర్ నోటీస్ ఇచ్చిన ఎన్‌సీటీఈ
- మరి కొన్ని కళాశాలలను విత్‌డ్రా చేసిన ఎన్‌సీటీఈ
- ఇవేమీ పట్టించుకోకుండా అఫ్లియేషన్ ఫీజు కట్టించుకున్న ఆర్‌యూ అధికారులు
- నేటి నుంచి బీఈడీ కళాశాలలను సందర్శించనున్న అఫ్లియేషన్ కమిటీలు

ఆర్‌యూ పరిధిలో ఉన్న బీఈడీ కళాశాలలు	అఫ్లియేషన్‌కు ఫీజు కట్టిన కళాశాలలు	ఎన్‌సీటీఈ పీఏఆర్ నోటీస్‌లు ఇచ్చిన కళాశాలలు	విత్ డ్రా (రద్దు చేసిన) చేసిన కళాశాలలు
43	43	13	8



కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ గుర్తింపునకు కొన్ని బీఈడీ కళాశాలల యాజమాన్యాలు అమ్యామ్యాలు ఇచ్చి అఫ్లియేషన్ ఫీజులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో అఫ్లియేషన్ కమిటీలు, వర్సిటీ అధికారులు అందరూ ఒకటై కళాశాలల యాజమాన్యాల లాబీంగ్‌కు, అమ్యామ్యాలకు తలొగ్గి బీఈడీ కళాశాలలను తూతూ మంత్రంగా సందర్శించి మమ అనిపించేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం వర్సిటీ అధికారులు బీఈడీ కళాశాలలను సందర్శించేందుకు కమిటీలను నియమించారు. ఈ కమిటీ సభ్యులు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు కళాశాలలను సందర్శించనున్నారు. నిబంధనల మేరకు కళాశాలల నిర్వాహణ ఉందా లేదా అని పరిశీలించి నివేదిక సమర్పిస్తారు. దీని ఆధారంగానే వర్సిటీ కళాశాలలకు అఫ్లియేషన్ ఇస్తుంది. అయితే వర్సిటీ పాలనను గాడిలో పెట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పుకుంటున్న ఆర్‌యూ ఉన్నతాధికారులు మరి నిబంధనల మేరకు అన్ని వసతులు ఉన్న కళాశాలలకు అఫ్లియేషన్ ఇస్తారో లేదో తేలనుంది. బీఈడీ కళాశాలలు ఎన్‌సీటీఈ అను మతి కోసం పొందు పరిచిన అడ్రస్‌లో కాకుండా మరో చోట చూపు తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని అఫ్లియేషన్ కమిటీలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తారా గుర్తిస్తారో చూడాలి.

అఫ్లియేషన్ కమిటీలు పరిశీలించాల్సినవి ..

- ఎన్‌సీటీఈ కొన్ని కళాశాలలకు ఇన్‌టేక్ 50 సీట్లకే అనుమతి ఇస్తే వారేమో 100 సీట్లు ఉన్నట్లు చెప్పుకొని అడ్మిషన్లు చేసుకుంటున్నారు.
- కళాశాల పేరు మీద 50 సీట్లు ఉంటే రూ. 6 లక్షలు, 100 సీట్లు ఉంటే రూ.12 లక్షలు బ్యాంక్‌లలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉండాలి. ఫిక్స్‌డ్‌డిపాజిట్ల ఒరిజినల్ బాండ్లు ఉన్నాయో లేదో చూడాలి. కొన్ని యాజమాన్యాలు జిరాక్స్ కాపీలను మాత్రమే చూపుతున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉండవు. ఒకవేళ ఉన్నా ఎన్‌ఓసీ తీసుకొని లోన్ తీసుకుంటున్నారు. బ్యాంక్‌లో చెక్ చేయాలి.
- బిల్డింగ్, లీజ్ బిల్డింగ్ అయితే లీజ్ అగ్రిమెంట్ లైవ్‌లో ఉందా లేదా (కొన్ని కళాశాలల బిల్డింగ్స్ లీజ్ పూర్తి అయినట్లు సమాచారం), స్టాఫ్ వేతనాల ఆన్‌లైన్ బ్యాంక్ స్టేట్‌మెంట్, ల్యాబ్, లైబ్రరీ ఉన్నాయా లేదా చూడాల్సి ఉంది. కొన్ని కళాశాలలు మల్టీ పర్పస్ బిల్డింగ్స్‌లో ఉన్నాయి.
- గతంలో బిల్డింగ్ ట్యాక్స్, శానిటరీ, బిల్డింగ్ స్ట్రక్షరల్ అండ్ సౌండ్ ,ఫైర్ సర్టిఫికెట్లు పరిశీలించారు. ఇందులో ఫైర్, శానిటరీ సర్టిఫికెట్లు ఫోర్జరీ సర్టిఫికెట్లు పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఏటా అఫ్లియేషన్ కమిటీలో కళాశాలలో ఉన్న డీపీ సెన్సీ లిస్ట్ ఇస్తారు. వచ్చే సంవత్సరానికి వాటిని ఫుల్ ఫిల్ చేయాల్సి ఉన్న చాలా కళాశాలలు పట్టించుకోవు.

అనుమానాలు

- పట్టించుకోకుండా వర్సిటీ అధికారులు అన్ని కళాశాలలకు (సుమారు 43) అఫ్లియేషన్ ఫీజు కట్టించుకున్నారు. అయితే ఎన్‌సీటీఈ కొన్ని కళాశాలలకు పర్ఫామెన్స్ అప్రైజల్ రిపోర్ట్ (పీఏఆర్) నోటీస్‌లు ఇవ్వడం, నోటీస్‌ల వివరణకు సంతృప్తి చెందక ఎన్‌సీటీఈ నుంచి విత్ డ్రా (కళాశాలల రద్దు) చేసింది. మరి వర్సిటీ అధికారులకు ఈ విషయాలు తెలుసో తెలియదో కానీ అన్ని కళాశాలలకు మాత్రం అఫ్లియేషన్ ఫీజు కట్టించుకున్నారు. మరి అఫ్లియేషన్ కమి టీలు అఫ్లియేషన్ ఫీజు చెల్లించిన అన్ని కళాశాలలను సందర్శిస్తారా లేదంటే ఎన్‌సీటీఈ క్లియరెన్స్ ఉన్న వాటినే సందర్శిస్తారా అనేది వేచి చూడాల్సిందే!

వాస్తవం..

- మనుగడలో ఉన్న 13 బీఈడీ కళాశాలలకు ఎన్‌సీటీఈ పర్ఫామెన్స్ అప్రైజల్ రిపోర్ట్ (పీఏఆర్) నోటీస్‌లు ఇచ్చింది. అయితే ఎన్‌సీటీ క్లియరెన్స్ లేకున్నా ఆర్‌యూ అధికారులు అఫ్లియేషన్ ఫీజు లు కట్టించుకున్నారు.
- 460, 461 ఈసీ మీటింగ్‌లలో ఆర్‌యూ పరిధిలో మనుగడలో ఉన్న 8 కళాశాలలకు పీఏఆర్ నోటీస్‌లకు ఇచ్చిన వివరణకు సంతృప్తి చెందక 2025 విద్యా సంవత్సరానికి గాను వాటిని విత్‌డ్రా (రద్దు) చేయడం చేసింది. రద్దు చేయబడిన కళాశాలలకు ఎన్‌సీటీఈ అనుమతి లేకుండానే వర్సిటీ అధికారులు అఫ్లియేషన్ ఫీజు కట్టించుకున్నారు.

- కొన్ని కళాశాలలు బిల్డింగ్స్ లేకుండానే కేవలం అడ్మిషన్లు చేసుకొని నడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. భవనాలు లేకపోయినా కోర్టు ఆర్డర్ తెచ్చుకొని కొనసాగిస్తున్నారు. కోర్టుకు వెళ్లాలనే సలహాను వర్సిటీలోని కీలక అధికారులే ఇస్తారనే ప్రచారం ఉంది.
- ప్రతి కళాశాలకు జియోట్యాగింగ్ ఉండాలి. చాలా కళాశాలలకుఈ వ్యవస్థ లేదనేది బహిరంగ రహస్యమే.

42 కళాశాలలకు ఫీజు కట్టారు

ఆర్‌యూ పరిధిలో 42 కళాశాలలు అఫ్లియేషన్ ఫీజు కట్టాయి. ఎన్‌సీటీఈ నుంచి పీఏఆర్ నోటీస్, విత్ డ్రా లిస్ట్ మాకు వచ్చింది. ఒక వేళ అఫ్లియేషన్ ఫీజు కట్టినా ఎన్‌సీటీఈ పీఏఆర్ నోటీస్, విత్ డ్రా ఉన్న కళాశాలలకు అఫ్లియేషన్ కమిటీలు విజిట్ చేయవు.

– డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ

బాల శాస్త్రవేత్తలకు భలే అవకాశం

- సృజనాత్మకత ఆవిష్కరణలకు ఆహ్వానం
- సెప్టెంబర్ 15 వరకు గడువు
- ఇన్‌స్పైర్ మనక్‌కు పాఠశాలల్లో రూపుదిద్దుకుంటున్న ప్రాజెక్టులు

నంద్యాల(న్యూటౌన్): చిన్నారుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీసి, వారిలో విజ్ఞాన జిజ్ఞాసను రేకెత్తించేందుకు ఇన్‌స్పైర్ మనక్ ఎంతో దోహదపడుతుంది. కేంద్ర, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన ప్రతిభను బయటకు తీయడం, సైన్స్‌పై వారికి ఆసక్తిని పెంచడం దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి నూతన ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ విద్యా సంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులతో కలిసి ఇన్‌స్పైర్ మనక్ ప్రోగ్రామ్‌లో పాల్గొనవచ్చు. ప్రతి తరగతి నుంచి ఒకరు వంతున ప్రాథమికోన్నత పాఠశాలకు మూడు, ఉన్నత పాఠశాలలు ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే వీలుంది. 2008–08 సంవత్సరం నుంచి ఏటా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఎంపికైన ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థుల ఖాతాలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున జమ చేశారు. అయితే అత్యధిక ప్రాజెక్టులు రిజిస్టర్ అయినప్పటికీ ప్రాజెక్టుల రూపకల్పనలో నాణ్యతా ప్రమాణాలు లోపించడం వల్ల ప్రాజెక్టుల ఎంపిక సంఖ్య తగ్గుతోందనే విమర్శలున్నాయి. ప్రాజెక్టుల్లో సృజనాత్మకత, నాణ్యత లోపించడంతో దీనికి కారణమని చెబుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 156 ప్రాథమికోన్నత, 277 ఉన్నత పాఠశాలలు ఉండగా, ప్రైవేట్ యాజమాన్యం పరిధిలో 167 ప్రాథమికోన్నత, 190 ఉన్నత పాఠశాలలున్నాయి.



సైన్స్‌ఫేర్‌లో కొడవలి యంత్రం పనితీరును వివరిస్తున్న విద్యార్థిని (ఫైల్)

గతేడాది ఇలా..

జిల్లాలో గతేడాది జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో 162 ప్రదర్శనలు ఎంపిక కాగా రాష్ట్రస్థాయికి 16 ఎంపిక చేశారు. వీటిలో పలు వినూత్న ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చాగలమర్రి జెడ్పీహెచ్ఎస్ ముల్లా మోమిన్ తయారు చేసిన ఉమెన్ సేఫ్టీ బ్యాగ్, వేంపెంట జెడ్పీహైస్కూల్ విద్యార్థి సంతోష్ రాజ్ రూపొందించిన సోలార్ అగ్రికల్చరల్ ఫెర్టిసైడ్ స్ప్రేయర్ విత్ లోకాస్ట్ పరికరం, బనగానపల్లె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి హర్షియభాను ఆవిష్కరించిన ఆటోమేటిక్ మినీ ఫ్యాన్ తదితర ఆవిష్కరణలు అందరినీ ఆలోచింపచేశాయి. ఈ ఏడాది మరింత మెరుగైన ఆవిష్కరణలను రూపొందించి జాతీయ స్థాయిలో ప్రదర్శించేలా పలు పాఠశాలల ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు.

ప్రాజెక్టులను పంపండిలా..

www.inspireawards&dst.gov.in వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా సెప్టెంబరు 15వ తేదీలోపు పాఠశాల విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టాలి. వారి నుంచి రూపుదిద్దుకున్న ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషకం అందజేస్తోంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేల వరకు తమ ప్రాజెక్టును మెరుగుపర్చుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన తదితర అవకాశాలతో పాటు ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశముంది. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలి.

జాతీయ స్థాయిలో నిలిచేలా



రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించాలి. ఈ ప్రక్రియను సైన్స్ ఉపాధ్యాయులు పర్యవేక్షించాలి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్సు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి.

–కేవీ సుబ్బారెడ్డి, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్, నంద్యాల

క్లుప్తంగా

బాలుడిపై కుక్క దాడి


బాలుడు కిరణ్ చేతికి గాయమైన దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన మల్లేశ్వరి, రమేష్ దంపతుల కుమారుడు కిరణ్‌పై ఆదివారం రాత్రి కుక్కదాడి చేసి గాయపరిచింది. కాలనీకి చెందిన మిత్రుడితో కలిసి ఇంటికెళ్తుండగా వీధిలో కట్టేసిన ఓ వ్యక్తికి చెందిన పెంపుడు కుక్క బాలుడు కిరణ్‌పై దాడి చేసింది. పక్కనే ఉన్న వారు కేకలు వేయడంతో వదిలేసింది. బాలుడికి చేతికి గాయం కావడంతో కుటుంబీకులు బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం అందించారు. సమాచారం తెలుసుకున్న సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ చిన్నారి బాలుడి పరామర్శించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం


మృతి చెందిన రెడ్డి మునెమ్మ

చాగలమర్రి: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై నగళ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన రెడ్డి మునెమ్మ (22)కు కంబంవారిపల్లె గ్రామానికి చెందిన యోగాంధుల రెడ్డితో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కుమార్తె హంసిక ఉంది. యోగాంధుల రెడ్డి నంద్యాల పట్టణంలో ఓ దంత వైద్యశాలలో డెంటల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం ఆయన భార్య, కుమార్తెతో కలసి బైక్‌పై సొంతూరు కంబంవారిపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యలో నగళ్లపాడు గ్రామం వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న మునెమ్మ కింద పడటంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మృతురాలి సోదరుడు రెడ్డి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్తూ..

బేతంచెర్ల: అనారోగ్యంగా ఉన్న కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి గాయపడి ఆసుపత్రి పాలైంది. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన జరీనా(23) తన కొడుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆదివారం చికిత్స నిమిత్తం మామ బాషాతో కలిసి బేతంచెర్లకు బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో సిమెంట్‌నగర్ గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో జరీనా తలకు తీవ్రగాయాలు కావడంతో బేతంచెర్ల ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

వీరభద్ర స్వామి

పెళ్లి చూపులకు రారండోయ్!

● కైరుప్పలలో వీరభద్రస్వామి ఉత్సవాలు ప్రారంభం


వీరభద్రస్వామి, కాళికాదేవి


వీరభద్రస్వామి దేవాలయం

ఆస్పరి: జిల్లాలో జరిగే ఉత్సవాల్లో ప్రత్యేకంగా నిలిచే పిడకల సమరం అందరికీ తెలిసే ఉంటుంది. ఏటా ఉగాది ఉత్సవాల సమయంలో కైరుప్పల గ్రామంలో వెలిసిన వీరభద్రస్వామి, కాళికాదేవి కల్యాణానికి ముందు జరిగే సంప్రదాయం ఉత్సవం రాష్ట్రంలోనే ప్రత్యేకం. ప్రేమికులైన వీరభద్రస్వామి, కాళికాదేవి వివాహం తంతులో మొదటి వేడుకగా నిర్వహించే పెళ్లి చూపులు శ్రావణ మాసంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు వీరభద్రస్వామి శ్రావణ మాసం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మాసం ముగిసేంత వరకు ప్రతి సోమవారం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి సాయంత్రం మేళతాళాలతో వీరభద్రస్వామిని పూల పల్లకీలో ఊరేగిస్తారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలి వచ్చి బియ్యం, బ్యాడెలు సమర్పించి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. పెద్దల కాలం నుంచి ఈ సంప్రదాయాలను కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మూడో సోమవారం పెళ్లి చూపులు

ప్రేమ వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచిన వీరభద్రస్వామి, కాళికాదేవిల పెళ్లి వ్యవహారం తంతూ మొత్తం ఆసక్తిగా నిలుస్తోంది. వీరభద్రస్వామి, కాళికాదేవి ప్రేమించుకున్న తరువాత ఏదో విషయంలో విభేదాలు వచ్చి స్వామి, అమ్మవార్ల వర్గాలు పంతాలు, పట్టింపులకు పోతారు. వీరి ప్రేమ విషయంలో పుప్పాలదొడ్డి గిడ్డాంజినేయ స్వామి, చెన్నంపల్లి కాత్రికాయ స్వామి మధ్యవర్తులుగా వచ్చి పంచాయితీలు చేసి ఇరు వర్గాల పెద్దలకు నచ్చజెప్పి పెళ్లికి ఒప్పిస్తారు. సంప్రదాయం ప్రకారం శ్రావణ మాసం మూడవ సోమవారం పెద్దలు గిడ్డాంజినేయస్వామి, కాత్రికాయస్వామితో కలిసి వీరభద్రస్వామి కాళికాదేవిని పెళ్లి చూపులు చూసేందుకు వెళ్తారు. ఇరు వర్గాల పెద్దల ఒప్పందం చేసుకున్న తరువాత కార్తీక మాసం ముగిసిన తరువాత వచ్చే మొదటి సోమవారం స్వామి అమ్మవార్ల నిశ్చితారం చేస్తామని గ్రామ పెద్దలు చెబుతున్నారు. శ్రావణ మాసం ముగిసేంత వరకు భక్తులు మాంసం, మద్యం ముట్టరు. ఉగాది వేడుకల్లో భాగంగా వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తారు. కాగా వీరభద్ర స్వామి కాళమ్మను వివాహం చేసుకుంటానని మాట ఇచ్చి ఆలస్యం చేస్తారని, ఓ రోజు వీరభద్ర స్వామి తన అనుచరులతో హంద్రీ తీరంలో విహారానికి వెళ్లి గ్రామానికి తిరిగి వస్తున్న సమయంలో పెళ్లికి ఆలస్యం చేస్తున్నాడని ఆగ్రహించిన కాళమ్మ (భద్రకాళి దేవి) తన అనుచరులతో పిడకలతో దాడి చేయిస్తోంది. వీర భద్రస్వామి తన అనుచరులతో కలిసి ప్రతి దాడి చేస్తాడు. ఆ తరువాత చుట్టుపక్కల స్వాములు, గ్రామ పెద్దలు ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి పెళ్లికి ఒప్పిస్తారు. పిడకల సమరం అనంతరం పార్వతి పరమేశ్వరుల సమక్షంలో ఒకటైన వీరభద్రస్వామి, కాళికాదేవిల కళ్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

“ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



ప్రతి ఏటా మాదిరిగా ఈ సంవత్సరం కూడా వీరభద్రస్వామి శ్రావణ మాసం ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రతి సోమవారం దూరప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులు స్వామి దర్శించుకుని నిద్రిస్తారు. ప్రతి సోమవారం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ ఉంటుంది. రెండవ సోమవారం వీరభద్రస్వామి పుట్టిన హంద్రీ కాలువకు వెళ్లి అక్కడ రాత్రంత భజన చేసి ఆ నీటితో అభిషేకం చేస్తాం. మూడవ సోమవారం వీరభద్రస్వామి పెళ్లి చూపులుంటాయి. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశాం.

– ప్రసాద్ పూజారి కైరుప్పల గ్రామం ఆస్పరి మండలం

భార్యను చూడటానికి వస్తూ మృత్యు ఒడికి!

● గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులు, విలపిస్తున్న భార్య, కుమార్తె

ఆస్పరి: తొమ్మిది నెలల గర్భవతి అయిన భార్యను చూడటానికి బైక్‌పై వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ దుర్ఘటన మండలంలోని కైరుప్పల గ్రామంలో చోటు చేసుకుంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆస్పరి సీఐ మస్తాన్‌వలి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. కైరుప్పల గ్రామానికి చెందిన శ్రీనివాసులు (31) నగరూరు గ్రామానికి చెందిన పూజను నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి రెండేళ్ల కూతురు సౌమ్య ఉంది. ప్రస్తుతం పూజ తొమ్మిది నెలలు గర్భిణి. శ్రీనివాసులు నంద్యాల జిల్లా ఆత్మకూరులో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి ఆత్మకూరు నుంచి భార్యను చూడటానికి స్కూటర్‌పై నగరూరు గ్రామానికి బయలు దేరారు. శనివారం రాత్రి మండలంలోని అట్టికల్లు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున అట్టికల్లు గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్తూ ఈ సంఘటనను చూసి బంధువులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి భార్య, కూతురు, కుటుంబ సభ్యులు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గాడిద పాలమ్మో...


గాడిద పాలు అమ్ముతున్న మహిళ

గంగిగోవు పాలు గరిటెడైన చాలు..కడివెడైననేమి ఖరము పాలు.. అన్న పద్యం ఇప్పుడు తిరగబడింది. ప్రస్తుతం గాడిద పాలు గరిటెడైనా చాలు అంటున్నారు. ప్రస్తుతం గాడిద పాలకు భలే డిమాండ్ ఉంది. ఉగ్గ గంటెడు పాలకు రూ.200 ప్రకారం విక్రయిస్తున్నారు. ఆదివారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో గాడిద పాలమ్మో.. అంటూ ఓ మహిళ గాడిదను తిప్పుతూ పాలు విక్రయిస్తూ కనిపించింది. ఊరూరా తిరుగుతూ ఉపాధి పొందుతున్న ఈమెను చూసిన జనం కూటి కోసం కోటి విద్యలు అని చర్చించుకుంటున్నారు. – దొర్నిపాడు


ప్యాలకుర్తి వద్ద బోరు కింద ఉల్లి నారుమడి

ఉల్లినారు అ'ధర'హో

తుఫాన్ ప్రభావంతో మోస్తరుగా వర్షాలు కురుస్తుండటంతో ఉల్లినారుకు డిమాండ్ పెరిగింది. నాలుగైదు రోజుల కిందటి వరకు ఒక్కో బెడ్డు ఉల్లి నారు రూ.1500 నుంచి రూ.2000 వరకు పలికింది. ప్రస్తుతం ఒక్కో బెడ్డు ఉల్లినారును రూ.2500 నుంచి రూ.3000 వరకు అమ్ముతున్నారు. ఒక ఎకరా ఉల్లి నాటాలంటే సుమారు 6 నుంచి 7 బెడ్ల ఉల్లినారు అవసరమవుతుంది. కోడుమూరు, గూడూరు మండలాల్లో రైతులు వర్షాధారం కింద ఉల్లినాట్లు వేస్తున్నారు. కోడుమూరు, వెంకటగిరి గ్రామాల్లో 1,500పైగా ఎకరాల్లో ఉల్లినాట్లు సాగుతున్నాయి.

– కోడుమూరు రూరల్

కుందూనదికి పోటెత్తిన వరద


గుళ్లదూర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

కోవెలకుంట్ల: శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కుందూనదికి భారీగా నీటిని విడుదల చేయడంతో కుందూనదికి వరదనీరు పోటెత్తింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి శ్రీశైలం రిజర్వాయర్‌కు భారీగా వరద చేరింది. నదితీర గ్రామాల ప్రజల తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇటీవల కుందూకు నీటిని విడుదల చేశారు. కోవెలకుంట్ల, వల్లంపాడు, గుళ్లదూర్తి, కలుగొట్ల సమీపాల్లో కుందూనది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలు నది పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు హనుమన్న

కర్నూలు(అర్బన్): గృహ నిర్మాణ సంస్థలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ఆ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీ హనుమన్న కోరారు. ఆదివారం స్థానిక సంక్షేమభవన్‌లోని హౌసింగ్ ఈఈ కార్యాలయ ఆవరణలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన హౌసింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమన్న మాట్లాడుతూ,, 20 సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న వర్క్ ఇన్స్‌పెక్టర్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంబీసీ, ఏఈ, ఐటీ మేనేజర్ తదితర కేడర్లలో ఉన్న వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. అలాగే ఫీల్డ్‌లో పని చేసే వారికి ఎఫ్‌టీఏ కూడా ఇవ్వడం లేదని, అనేక మంది ఉద్యోగులకు సొంత గృహాలు కూడా లేవన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు ప్రభుత్వం ఇస్తున్న జీతం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం నెలకు ఇస్తున్న రూ.16,411లు ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లులు, ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్ అయిన ఉద్యోగుల స్థానంలో తమకు అవకాశం కల్పించాలని కోరారు. సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు హౌసింగ్ విధుల నుంచి తప్పించి హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగించాలన్నారు. సీనియారిటీ వర్క్ ఇన్స్‌పెక్టర్లకు ఎంబీసీ, ఏఈలుగా పదోన్నతి కల్పించాలని, డీఈఓలను జూనియర్ అసిస్టెంట్లుగా మార్చాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు నేనావత్ రామునాయక్, నాయకులు ఎండీ యాసిన్, అఫ్రోజ్, ఉస్మాన్, దస్తగిరి, రామేశ్వరి, షాకీరా, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

● జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆయా పోలీసు స్టేషన్లలో పోలీసులు రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే తప్పనిసరిగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాటు సారా తరలిస్తూ ఇద్దరు అరెస్టు

నవోదయం కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ పోలీసులు ఆదివారం కల్లూరు మండలం ఉల్లిందకొండ నుండి డోన్ వైపు వెళ్లే రహదారి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. కొల్లం పల్లి తండాకు చెందిన భూక్యా గోపాల్ నాయక్, బస్తి పాడు గ్రామానికి చెందిన పురుషోత్తంలు ద్విచక్రవాహనంపై 20 లీటర్ల నాటు సారా తరలిస్తూ పట్టుబడ్డారని ఎక్సైజ్ అధికారులు రాజేంద్ర ప్రసాద్, నవీన్ బాబు వెల్లడించారు. వీరిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆధునిక వైద్యంపై అవగాహన పెంచుకోవాలి


జ్యోతి ప్రజ్వలనతో వైద్య వైజ్ఞానిక సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

గోస్పాడు: ఆధునిక వైద్య పరిణామాలపై ప్రతి వైద్యుడు మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు అన్నారు. ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ జి.నందకిశోర్ అధ్యక్షతన ఆదివారం నంద్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాయలసీమ స్థాయి వైద్య వైజ్ఞానిక సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి, తొలి భారత వైద్య పితామహుడు డాక్టర్ బీసీ రాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి. శ్రీహరి రావు మాట్లాడుతూ ప్రతి వైద్యుడు 5 సంవత్సరాలకు ఒకసారి మెడికల్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. వైద్యులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం, రెన్యువల్ చేసుకోవడానికి విజయవాడ కౌన్సిల్ ఆఫీస్‌కి రావాల్సిన అవసరం లేకుండా జిల్లాలలోనే చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఎటువంటి వైద్య అర్హతలు లేని వారు, ప్రాథమిక చికిత్సకు అనుమతి ఉన్నవారు తమ పరిధి దాటి వైద్యం చేసి రోగులకు నష్టం కలిగిస్తే కౌన్సిల్ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

- ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న నూతన పరిణామాలపై వైద్యులు అవగాహన పెంచుకోవడం చాలా అవసరమని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి ఇది దోహదం చేస్తుందన్నారు.
- రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని 100 ఐఎంఏ శాఖల ద్వారా సామాజిక సేవలను చేపట్టామని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో తమ వంతు పాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు.
- సదస్సు నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంతీయ వైద్య సదస్సును నిర్వహించడంతో ఈ ప్రాంతంలోని వైద్యులకు ఆధునిక వైద్య పరిణామాలపై అవగాహన పెంచడానికి దోహదం చేస్తుందన్నారు.
- అనంతరం డాక్టర్లు రవీంద్ర, సురేష్, అశోక్, రాహుల్, రామేశ్వర్ రెడ్డి, మణిదీప్, హర్షవర్ధన్ రెడ్డి, సహదేవుడు వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రసాద్, కిశోర్, విజయభాస్కర్ రెడ్డి, భార్గవర్ధన్‌రెడ్డి, అనిల్ కుమార్, శ్రీదేవి, హేమలత, పనిల్ కుమార్, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ నేతల సంఘీభావం

కర్నూలు(అర్బన్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం స్థానిక రాముల దేవాలయంలో జరిగిన సమావేశంలో కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్‌డీ కృష్ణోజీరావు, వైస్ చైర్మన్‌గా బేతం కృష్ణుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నాగప్ప, మాదన్న, పీ వెంకటేశ్వర్లు, కే వెంకటేశ్వర్లు, శేషిరెడ్డి, ఈరాబాయి ఎన్నికయ్యారు. అలాగే జిల్లా అధ్యక్షులుగా జీ పుల్లంరాజు, ఉపాధ్యక్షులుగా మోహిద్దీన్‌బాషా, కార్యవర్గ సభ్యులుగా ఎస్ఎస్ రావు, పీ వసంతరావు, గఫూర్, వెంకటరమణ, శ్రీనివాసులు, బుజ్జిబాబు, నరసింహులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ కృష్ణోజీరావు మాట్లాడుతూ.. తమ సంఘం ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను చేపట్టనున్నామన్నారు. గత కొంత కాలంగా రాష్ట్ర కార్యవర్గం లేని కారణంగా సంఘం కార్యకలాపాలు స్తబ్దుగా ఉన్నాయని, ఇక నుంచి తరచూ సమావేశాలను నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం కార్యక్రమాలను చేపడతామన్నారు.

ఇంటి వద్ద 'బొన్సాయ్' హాయి



వృక్షాలుగా ఉన్న మొక్కలు



కుండీల్లో వృక్షాలు పెరగడం ఏమిటా అని ఆలోచిస్తున్నారా? ఇవి బొన్సాయ్ మొక్కలు. పరిశీలిస్తే కాండం, కొమ్మలు కనిపిస్తాయి. చూపరులకు హాయిని ఇస్తాయి. వీటిని ఎవరూ పెరటి స్థలంలో పెంచరు. కర్నూలులోని గణేష్‌నగర్‌కు చెందిన రాజు అనే వ్యక్తి ఇంటి పెరటిలో వీటిని పెంచారు. ఫీకస్ పాండా, జెడ్ బోన్యామ్, చింత బొన్సాయ్, మర్రిచెట్టు, మధుకామిని, ఫికస్ బెంజమెనా తదితర మొక్కలు ఆకర్షణీయంగా ఉన్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


పెరటి స్థలంలో ఉన్న బొన్సాయ్ మొక్కలు


ఆకట్టుకునే థింబుల్ కాక్టస్

బైక్ అదుపు తప్పి..

జూపాడుబంగ్లా: కర్నూలు – ఆత్మకూరు రహదారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జూపాడుబంగ్లాకు చెందిన ఈశ్వరరెడ్డి (39) దుర్మరణం చెందాడు. ఆటో డ్రైవర్‌గా పని చేసే ఈశ్వరరెడ్డి సొంత పని నిమిత్తం నందికొట్కూరుకు వెళ్లాడు. రాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గిడ్డాంజనేయ రైస్‌మిల్లు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఈశ్వరరెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. వాహనదారుల సమాచారంతో 108 సిబ్బంది నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు అతన్ని పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకొన్న మృతుని బంధువులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విషయం తెలుసుకొన్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, ఏఎస్‌ఐ సంజీవ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.